క్లుప్తంగా

కంటి క్యాన్సర్‌పై వైట్‌థాన్ వాక్



పెనమలూరు: కంటి క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన పెంచడానికి తాడిగడప ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం వైట్‌థాన్ వాక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వివరాలు తెలుపుతూ రెటినోబ్లాస్టోమా అనే కంటి క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన పెంచడానికి వైట్‌థాన్ వాక్ చేపట్టామన్నారు. కంటి క్యాన్సర్ అత్యంత ఖరీదైన వైద్యమని అన్నారు. అందుకుగాను వైట్‌థాన్ వాక్‌తో విరాళాలు సేకరించి పేద పిల్లలకు ఉచిత వైద్యం అందిస్తామని తెలిపారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న రెండు వేల మంది పిల్లలకు సేవలు అందిస్తామని తెలిపారు. ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆవర్తనం



కంకిపాడు: ఉపరితల ఆవర్తన ద్రోణి కొనసాగుతోంది. ఆవర్తనం కారణంగా యడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. నాలుగు రోజులుగా పెనమలూరు నియోజకవర్గం వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి. పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. రోడ్డు మార్జిన్‌ల్లోనూ అదే పరిస్థితి. వరుసగా కురుస్తున్న వర్షాలతో రైతాంగం వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. రైతుభరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉండటంతో విత్తనాలను కొనుగోలు చేసి పొలాల్లో చల్లుతున్నారు. పొలాలను దుక్కులు దున్ని సాగుకు సమాయత్తం అవుతున్నారు.

తాళ్లూరికి ఉత్తమ సేవా అవార్డు ప్రదానం



పెనమలూరు: ఉత్తమ సేవలు అందిస్తున్న కానూరు అశోక్ జిమ్, మాతృ హృదయ్ స్వచ్ఛంద సేవాసంఘ్ నిర్వాహకుడు, జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి తాళ్లూరి అశోక్‌కు విజయవాడ రోటరీ మిడ్ టౌన్ క్లబ్ ఉత్తమ సేవా అవార్డును ఆదివారం విజయవాడలో అందజేశారు. తాళ్లూరి అశోక్ చేసిన సేవా కార్యక్రమాలకు గానూ రోటరీ క్లబ్ ఆయనకు ఉత్తమ సేవా అవార్డు ప్రదానం చేశారు. అశోక్ 66 సార్లు రక్తదానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ గవర్నర్ రావూరి సుబ్బారావు, గురుగోవింద్ సేవా సంస్థ నిర్వాహకుడు కరంబీర్ కౌర్, క్లబ్ అధ్యక్షుడు సాదుప్రసాద్, కార్యదర్శి సందీప్, పలు స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నిబద్ధత గల కమ్యూనిస్టు విజయ్‌కుమార్

కంకిపాడు: నిబద్ధత గల కమ్యూనిస్టు మేరుగు విజయ్‌కుమార్ అని వక్తలు కొనియాడారు. ఈడుపుగల్లు మాజీ సర్పంచ్, సీపీఐ పెనమలూరు నియోజకవర్గ నేత మేరుగు విజయ్‌కుమార్ సంస్మరణ సభ ఆదివారం ఈడుపుగల్లు గ్రామంలోని ఆయన నివాసం వద్ద నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లి విల్సన్ మాట్లాడుతూ నిబద్ధత, చిత్తశుద్ధి గల నేత విజయ్‌కుమార్ ఆదర్శప్రాయుడని అన్నారు. సీపీఐ సీనియర్ నేత వెలగపూడి ఆజాద్ అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అక్కినేని వనజ, కెవివి.ప్రసాద్, ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెనుమత్స దుర్గాభవాని, పార్టీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, పలువురు ప్రజాసంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

నాడు-నేడుతో కొత్త రూపు

- శరవేగంగా పాఠశాలల అభివృద్ధి పనులు
- సమకూరుతున్న అధునాతన వసతులు
- విద్యాసంవత్సరం ప్రారంభానికి పనులు పూర్తి చేసేందుకు చర్యలు



అదనపు తరగతి గదుల నిర్మాణంలో ఉన్న కంకిపాడు జిల్లా పరిషత్ పాఠశాల

కంకిపాడు: కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు కొత్త రూపు సంతరించుకుంటున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు సమకూరుతున్నాయి. నాడు-నేడు కింద పాఠశాలల అభివృద్ధి పనులు కంకిపాడు మండలంలో శరవేగంగా సాగుతున్నాయి. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభానికి పాఠశాలల్లో అన్ని రకాల వసతులను కల్పించేలా ప్రణాళికాబద్ధంగా పనులు సాగుతున్నాయి.

తొలిదశలో రూ. 5.03 కోట్లతో పనులు..

మండలంలోని వివిధ గ్రామాల్లో తొలి దశలో 28 ప్రభుత్వ పాఠశాలలను గుర్తించారు. ఆయా పాఠశాలలను సమూలంగా, సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు నాడు-నేడు కింద ప్రభుత్వం రూ. 5.03 కోట్లను కేటాయించింది. ఈ నిధులతో ఆయా పాఠశాలల్లో 195 పనులను గుర్తించారు. అదనపు తరగతి గదుల నిర్మాణం, మరుగుదొడ్లు, ప్రహరీగోడలు, మరమ్మతులు వంటి అనేక పనులను పూర్తి చేశారు. అధికారిక లెక్కల ప్రకారం 193 పనులు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. రూ. 5.03 కోట్ల అంచనాతో పనులు చేపట్టగా, అంచనా వ్యయం పెరగడంతో రూ. 5.57 కోట్లతో పనులు పూర్తి చేశారు. మౌలిక వసతుల కల్పనతో పాటుగా క్రీడా ప్రాంగణాల అభివృద్ధి, క్రీడా వస్తువులు సమకూర్చడం ద్వారా క్రీడల పట్ల విద్యార్థులు ఆసక్తి పెంచుకున్నారు. పాఠశాలలు ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంతో పాఠశాలలకు విద్యార్థులు వచ్చేందుకు ఆసక్తి చూపారు.

రెండో దశలో రూ. 5.42 కోట్లతో పనులు..

రెండో దశ నాడు-నేడు కింద మండలంలోని 11 పాఠశాలలను ఎంపిక చేశారు. ఎంపీపీ, జెడ్పీ పాఠశాలలు ఈ జాబితాలో ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 108 రకాల పనులను చేపట్టేందుకు రూ. 5.42 కోట్లతో అంచనాలు రూపొందించారు. ఇప్పటికే రూ. 1.53 కోట్ల అంచనా పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులను విద్యాసంవత్సరం ప్రారంభానికి పూర్తి చేసేందుకు అధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. మౌలిక వసతుల కల్పన సమర్థంగా సాగుతుండటంతో వచ్చే విద్యాసంవత్సరంలో పాఠశాలల్లో విద్యార్థుల హాజరు మరింత పెరుగుతుందన్న అంచనాలో అధికారులు, తల్లిదండ్రుల కమిటీ ప్రతినిధులు ఉన్నారు. పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రయోజనకరంగా అభివృద్ధి సాగేలా చర్యలు చేపడుతున్నారు.

స్ఫూర్తిదాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య



ఉయ్యూరులో సుందరయ్య చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



వర్ధంతి సభలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఉయ్యూరు: కమ్యూనిస్టు ఉద్యమ నేత పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తిదాయకుడు అని పలువురు వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని మానికొండ భవన్‌లో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు అట్లూరి రామచంద్రరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుందరయ్య చేసిన పోరాటాలు, ప్రజల కోసం చేసిన త్యాగాలను కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం ఉయ్యూరు పట్టణ కార్యదర్శి రాజేష్, నాయకులు లక్ష్మణరావు, ఇస్మాయిల్, నిమ్మాది గోపాల్, అన్నే సుబ్బారావు, కీర్తి పాల్గొన్నారు.

గన్నవరం: స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం కమ్యూనిస్టు ఉద్యమ నేతలు పుచ్చలపల్లి సుందరయ్య, అట్లూరి శ్రీమన్నారాయణ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, జిల్లా నాయకుడు ఆర్.రఘు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నేతలు మాట్లాడుతూ.. పేదల కోసం జీవితమంతా పోరాడిన సుందరయ్య, శ్రీమన్నారాయణ స్ఫూర్తినీయులని అన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, ఆర్థిక విశ్లేషకుడు గన్నె వెంకట్రావు, సీపీఎం నేతలు కళ్లం వెంకటేశ్వరరావు, అనుమోలు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు: పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఆదివారం మండల పరిధిలోని తాడిగడప, యనమలకుదురు గ్రామాల్లో నిర్వహించారు. సుందరయ్య ఫొటోకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ సుందరయ్య జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మండల సీపీఎం కార్యదర్శి ఉప్పాడు త్రిమూర్తి, నేతలు నారిన వెంకట్రావు, అన్నవరపు శ్రీనివాసరావు, షేక్ కాశిం, షేక్ మస్తాన్‌వలి, పి.లక్ష్మీనారాయణ, భాస్కరరావు, అమరయ్య శాస్త్రి, శ్రీరాములు, షేక్ బాబు, పల్లా చినపాపారావు, వసంతరావు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: నిరాడంబర రాజకీయ జీవితం గడిపి, పేద ప్రజల అభ్యున్నతికై అహర్నిశలు పాటుపడిన పుచ్చలపల్లి సుందరయ్య చిరస్మరణీయుడని పలువురు వక్తలు కొనియాడారు. పుచ్చలపల్లి వర్ధంతి కార్యక్రమాన్ని బాపులపాడు మండలం పెరికీడులో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. పుచ్చలపల్లి చిత్రపటానికి సీఐటీయూ మండల కార్యదర్శి నల్లి ఆంజనేయులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పుచ్చలపల్లి సుందరయ్య నిరాడంబర జీవితం, నిస్వార్థ ప్రజాసేవ, అంకితభావం నేటి తరం రాజకీయ నాయకులకు ఆదర్శనీయమని కొనియాడారు. సీఐటీయూ నాయకులు చింతా వీర వెంకట సత్యనారాయణ, రాంబాబు పాల్గొన్నారు.

వైభవంగా చినకంచిలో శ్రీరామ పట్టాభిషేకం



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతిస్వామి దేవస్థానం చిన కంచిలో ఆదివారం శ్రీరామ పట్టాభిషేకం వైభవంగా జరిగింది. తొలుత గణపతి పూజ, మండపారాధన చేసి హనుమ, సీతారామ లక్ష్మణ, భరత, శత్రుఘ్నులను అష్టదిక్పాలకులను, బ్రహ్మ, విష్ణు, మహేశ్వర తదితర దేవతామూర్తులను కలశములలో అవాహనం చేశారు. అనంతరం సీతారామ లక్ష్మణులకు పూజలు నిర్వహించారు. వాల్మీకి, సీతారామ పరివారానికి, వశిష్టాధిపతులకు పూజలు చేశారు. ప్రజలు చేసిన కలశపు నీటితో సముద్ర జలాలు, గంగా, సింధూ, కృష్ణ, గోదావరి, నర్మద, నదీ జలాలు, పంచామృతాలు, పండ్ల రసాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి నూతన వస్త్రాలు ధరించి, రాజముద్రిక, రాజ చిహ్నాలతో పట్టాభిషేక కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బ్రహ్మశ్రీ చింతలపాటి వెంకటేశ్వరశర్మ నిర్వహించారు. వేదపండితుల దంపతులను నూతన వస్త్రాలతో సత్కరించారు. వేదపండితులు ఇనుగంటి పవన్‌కుమారవర్మ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల సమస్యలు తొలిదశలోనే గుర్తించాలి



ప్రసంగిస్తున్న డాక్టర్ కిరణ్‌రోహిత్

పెనమలూరు: పిల్లల్లో ఉన్న ఎదుగుదల సమస్యలను తొలిదశలోనే గుర్తిస్తే వారి ఎదుగుదలలో ఉన్న లోపాలు నివారించగలుగుతామని డాక్టర్ చెరుకూరి కిరణ్‌రోహిత్ అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఆదివారం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, వాకర్స్‌క్లబ్, శ్రీక్లినిక్ సంయుక్తంగా పిల్లల్లో వచ్చే ఎదుగుదల సమస్యలు, వేసవి కాలంలో వచ్చే చర్మవ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్‌రోహిత్ మాట్లాడుతూ పిల్లలు వేళ్లు చీకటం, మాటలు ఆలస్యంగా రావడం, నత్తి, శబ్దాలను గుర్తించకపోవడం వంటి సమస్యలు ఉన్నప్పుడు తల్లితండ్రులు వెంటనే గుర్తించి వైద్య సేవలు అందించాలన్నారు. డాక్టర్ తాళ్లూరి ప్రవల్లిక మాట్లాడుతూ వేసవిలో వచ్చే చర్మ వ్యాధుల నివారణకు పరిశుభ్రత పాటించాలని సూచించారు. చర్మ పరిరక్షణకు తగిన సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, వాకర్స్ క్లబ్ సభ్యులు రూప్‌కుమార్, తాతాసతీష్ తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయం వద్ద బాటసారులు, ప్రయాణికులకు ఆదివారం ఉచిత మజ్జిగ పంపిణీ చేశారు. దాతలు కుడితపూడి నాగ నరేంద్ర, నాగపద్మల సహకారంతో ఈ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్ మాట్లాడుతూ దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఉచిత మజ్జిగ పంపిణీకి సహకరిస్తున్నట్లు తెలిపారు. వేసవి పూర్తైయ్యేంత వరకూ ఈ శిబిరాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: పెనమలూరు సెంటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయలు అవ్వడంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు అంబేడ్కర్ కాలనీకి చెందిన వీరాబత్తిన బాలస్వామి రాడ్‌బెండింగ్ పనులు చేస్తాడు. అతనికి భార్య ఇద్దరు పిల్లలు. బాలస్వామి తన బైక్‌పై పెనమలూరు సెంటర్‌లో రోడ్డు క్రాస్ చేస్తుండగా విజయవాడ నుంచి కంకిపాడు వైపునకు వెళుతున్న కారు అతనిని ఢీ కొట్టింది. గాయపడిన అతనిని విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

తల్లి, కొడుకు అదృశ్యం

పెనమలూరు: కానూరులో తల్లి, కొడుకు అదృశ్యం కావడంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు తెలిపిన వివరాల ప్రకారం కానూరులో పి.కనకదుర్గ కుటుంబసభ్యులతో ఉంటుంది. ఆమె కుమార్తె జ్యోతి వైజాగ్‌లో ఉంటుంది. కొడుకు కానూరులో ఉంటున్నాడు. గత ఏప్రిల్ నెలలో సోదరుడు వివాహం జరగడంతో జ్యోతి, తన కుమారుడు రోహిత్‌తో కలిసి వైజాగ్ నుంచి వచ్చి కానూరులోనే ఉన్నారు. అయితే ఈ నెల 18వ తేదీన జ్యోతి, తన కుమారుడు రోహిత్‌తో ఇంటి నుంచి అదృశ్యమైంది. ఈ ఘటనపై తల్లి కనకదుర్గ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

యోగా సాధనతో ఉన్నత స్థితికి చేరుకోవచ్చు



యోగా సాధన చేస్తున్న విద్యార్థులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): యోగా సాధనతో ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకోవచ్చని యోగా ఇన్‌స్ట్రక్టర్ ప్రభాకర్ అన్నారు. బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాలో ఉచిత శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆదివారం విద్యార్థులకు ఆసన, ప్రాణాయామ, యోగా ప్రక్రియలో ఉచిత శిక్షణ ఇస్తున్నామన్నారు. గురు విశ్వస్ఫూర్తి మానవాళికి అందించిన దివ్య ఔషధం ప్రస్థాన సాధన అని ఆయన పేర్కొన్నారు. ట్రస్ట్ సభ్యులు కొలిపాక మాధవ్ మాట్లాడుతూ.. ఈ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో చదువులపై ఉన్న భయం, బద్ధకం తొలగడంతో పాటు ఏకాగ్రత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్ఫూర్తి కుటుంబం ట్రస్టీ సభ్యులు చొప్పరపు నారాయణరావు, గుణశేఖర్, గ్రంథాలయ అధికారి రమాదేవి, స్ఫూర్తి కుటుంబం వలంటీర్స్, 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలతో విజ్ఞానం, వినోదం



ఉయ్యూరు గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు



పెనమలూరు గ్రంథాలయంలో విద్యార్థులు



పురుషోత్తపట్నం గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు



ఉంగుటూరులో చెస్ ఆడుతున్న విద్యార్థులు

కంకిపాడు: వేసవి శిబిరాలతో విజ్ఞానం, వినోదం లభిస్తాయని తెన్నేరు శాఖా గ్రంథాలయాధికారి ఎస్.సునీత అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో తెన్నేరు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు కొనసాగుతున్నాయి. శిబిరంలో భాగంగా ఆదివారం కథల పోటీలు, క్యారమ్స్‌లో శిక్షణ ఇచ్చారు. సునీత మాట్లాడుతూ గ్రంథాలయాల్లో లభించే విజ్ఞానాన్ని, వినోదాన్ని వినియోగించుకుని చదువుల్లో రాణించాలని సూచించారు.

గన్నవరం రూరల్: పుస్తక పఠనం విద్యార్థులకు ఎంతో మేలు చేస్తుందని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం అన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులతో నీతి కథల పుస్తకాలను చదివించారు. ఈ వేసవి సెలవుల్లో విద్యార్థులు టీవీలు, సెల్‌ఫోన్‌లు చూడకుండా పుస్తకాలను చదివించడమే ఈ సమ్మర్ క్యాంపు లక్ష్యమని తెలిపారు. ప్రతి రోజు విద్యార్థులు హాజరై పుస్తకాలు చదవడం, వ్యాసరచన, ఆటల పోటీల్లో పాల్గొనడం చేయాలన్నారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, పాఠకులు పాల్గొన్నారు.

పెనమలూరు: పెనమలూరు శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని శాఖా గ్రంథాలయాధికారిణి పి.హరీషా తెలిపారు. ఆమె ఆదివారం వివరాలు తెలుపుతూ విద్యార్థులకు చదవడం, చిత్రలేఖనం, ఆటపాటలు, వివిధ పోటీలు నిర్వహిస్తామని అన్నారు. కాగా వణుకూరు శాఖా గ్రంథాలయంలో ఆదివారం వేసవి విజ్ఞానం శిక్షణా తరగతుల్లో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠనం, జనరల్ నాలెడ్జ్, ఆటల పోటీలు నిర్వహించామని గ్రంథాలయ అధికారి భారతి తెలిపారు.

ఉయ్యూరు: గ్రంథాలయాల్లో వేసవి శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. ఉయ్యూరు గ్రంథాలయంలో విద్యార్థులకు ఆదివారం పుస్తక పఠనంపై శిక్షణ ఇచ్చారు. చారిత్రక అంశాలు, పుస్తక పఠనంతో కలిగే ప్రయోజనాలపై ఆచార్యులు హయగ్రీవ రాఘవ అవగాహన కల్పించారు. శ్లోకాలను పఠింపజేశారు. గ్రంథాలయాధికారి బి.రమణి పర్యవేక్షించారు. పెద ఓగిరాల, కాటూరు, ముదునూరు గ్రంథాలయాల్లో శిక్షణా తరగతులు నిర్వహించారు.

ఉంగుటూరు: మండలంలోని శాఖా గ్రంథాలయాల్లో కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ఉత్సాహంగా విద్యార్థులు పాల్గొంటున్నారు. ఉంగుటూరు శిబిరంలో ఆదివారం విద్యార్థులతో పుస్తక పఠనం, కథలు చెప్పించారు. క్యారమ్స్, చెస్, లూడో గేమ్స్ వంటి ఆటలు ఆడించారు. అదేవిధంగా తేలప్రోలు, మానికొండ, ఆత్కూరు గ్రామాల్లోని శాఖా గ్రంథాలయాల్లో వేసవి తరగతులు నిర్వహిస్తున్నారు.

పచ్చిరొట్ట ఎరువులు ఉపయోగించండి




పెదపులిపాకలో పచ్చిరొట్ట ఎరువుల స్టాకు పరిశీలిస్తున్న ఏఓ శైలజ


పెనమలూరు: రైతులు పచ్చిరొట్ట ఎరువులు వేసి పంట దిగుబడి సాధించాలని మండల వ్యవసాయాధికారిణి కే శైలజ అన్నారు. పెదపులిపాక ఆర్బీకేలో పచ్చిరొట్ట ఎరువుల స్టాకును ఆదివారం ఆమె పరిశీలించారు. ఏఓ శైలజ మాట్లాడుతూ పెనమలూరు మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో పచ్చి రొట్ట ఎరువు జీలగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దాదాపు 75 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎకరాకు 12-16 కిలోల జీలగ విత్తాలు వేయాలని సూచించారు. విత్తనాలు వేసిన 45 రోజుల తర్వాత భూమిలో కలియదున్నాలని చెప్పారు. దీని వల్ల భూమికి కావలసిన సేంద్రీయ ఎరువులు సులువుగా అందుతాయని వివరించారు. జీలగ విత్తనాలు సబ్సిడీపై ఇస్తున్నామని కేజీ రూ. 88 ఉండగా 50 శాతం సబ్సిడీ పోను రూ. 44కే ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు.

1న హనుమత్ జయంతి ఉత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): విజయవాడ కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లోని శ్రీ వీరాంజనేయ స్వామివారి దేవస్థానంలో హనుమత్ జయంతి ఉత్సవాలను జూన్ ఒకటో తేదీన వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ రావూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, అనంతరం 108 కలశాల జలాలతో స్వామివారికి అభిషేకం, విశేష అర్చన జరుగుతుందని అర్చకులు ఖండపల్లి త్రినాథ ఆచార్యులు, విన్నకోట శ్రీనివాసరావు శర్మ పేర్కొన్నారు. ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు హరిహర అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అన్నప్రసాద పంపిణీ జరుగుతుందన్నారు. ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా క్యూ లైన్లు, భక్తులకు ఇతర వసతి సదుపాయాలను కల్పించాలని ఆలయ చైర్మన్ నందిపాటి శ్రీనివాసరావు ఆలయ అధికారులకు సూచించారు.

● స్మృతివనంలో పర్యాటకుల సందడి





విజయవాడ నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనంలో పర్యాటకుల సందడి నెలకొంది. ఆదివారం సెలవు కావడంతో పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చి స్మృతివనాన్ని సందర్శించారు. దీంతో స్మృతివనం ప్రాంగణం పర్యాటకులతో కిటకిటలాడింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ